# రేవంత్‌కు మతిస్థిమితం లేదు..



మాట్లాడుతున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న

- కాంగ్రెస్, బీజేపీలు ధోకేబాజ్ పార్టీలు
- బీఆర్ఎస్ మ్యానిఫెస్టోతో అందరికీ ప్రయోజనం
- కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం అవుతారు..
- ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న

ఆదిలాబాద్, అక్టోబర్ 16(నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ మ్యానిఫెస్టో విషయంలో టీపీసీసీ అధ్యక్షుడు మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నాడని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న మండిపడ్డారు. సోమవారం ఆదిలాబాద్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ గ్యారంటీలకు బీఆర్ఎస్ కాపీ కొట్టిందని అనడం ఆయన అవివేకానికి నిదర్శమన్నారు. 60 ఏండ్లపాటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. కర్ణాటక ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు నేరవేర్చడం లేదని ప్రశ్నించారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, మరో నాయకుడు లక్ష్మణ్ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీలు రెండు ధోకేబాజ్ పార్టీలని విమర్శించారు.

## మ్యానిఫెస్టోతో అన్ని వర్గాలకు ప్రయోజనం

ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన మ్యానిఫెస్టో అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం చేకూర్చేలా ఉందన్నారు. సౌభాగ్యలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు రూ.3 వేల గౌరవభృతి, రైతుబంధు పథకాన్ని ఐదేళ్లలో రూ.16 వేలు అందించనున్నట్లు, ఆసరా పింఛన్లు దశలవారీగా రూ.5,016కు పెరుగుతాయని పేర్కొన్నారు. దివ్యాంగులు పింఛన్లు ఇప్పటికే రూ.4016 కు పెరిగాయని వచ్చే ఏడాది రూ. 5 వేలకు పెరిగి క్రమంగా రూ. 6 వేలకు చేరుతాయన్నారు. కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధర పెంచిందని, ఆ ధరను రూ.400కే సిలిండర్ రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తుందని తెలిపారు. 'కేసీఆర్ బీమా–ప్రతి ఇంటికీ ధీమా' పథకంలో భాగంగా ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా సౌకర్యం వర్తింపచేయనుందని, కేసీఆర్ ఆరోగ్యలక్ష్మి పథకంలో భాగంగా ఆరోగ్యశ్రీ గరిష్ఠ పరిమితిని రూ.15 లక్షలకు పెంచనున్నట్లు తెలిపారు. రేషన్ దుకాణాల్లో లబ్ధిదారులకు సన్నబియ్యం అందించనున్నట్లు, మహిళా గ్రూపులకు భవనాల నిర్మాణం, ఆగ్రవర్ణ పేదలకు ప్రతి నియోజకవర్గంలో రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ వంద సీట్లు సాధించడం ఖాయమని, కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం అవుతారన్నారు. ఈ సమావేశంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అలాల అజయ్, నాయకులు పాల్గొన్నారు.

## కారు.. మన కేసీఆర్..

### ఇదే మా ఎన్నికల నినాదం

- మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్సే..
- సంక్షేమ పథకాలకు కేరాఫ్ తెలంగాణ
- ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న
- బీఆర్ఎస్‌లో బీజేపీ నాయకుల చేరిక
- కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే

ఎదులాపురం, అక్టోబర్ 16 : 'కారు.. మన కేసీఆర్.. ఇదే మా ఎన్నికల నినాదం' అని ఆదిలాబాద్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న పేర్కొన్నారు. సోమవారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బీజేపీ పార్టీకి చెందిన ముఖ్య కార్యకర్త, వార్డు మెంబర్ రాపెల్లి హనుమండ్లుతోపాటు కాలనీవాసులు 50 మంది గులాబీ కండువాలు కప్పుకున్నారు. వారికి ఎమ్మెల్యే జోగు రామన్న గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలో సంక్షేమ పథకాలకు తెలంగాణ రాష్ట్రం కేరాఫ్‌గా నిలిచిందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీతోనే 49 వార్డులు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని గుర్తు చేశారు. తెలంగాణ అన్ని రంగాలలో నంబర్‌వన్‌గా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు అలాల్ అజయ్, జైనథ్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వేణుగోపాల్ యాదవ్, అధికార ప్రతినిధి బి. గంగారెడ్డి, బీసీ పట్టణాధ్యక్షుడు దాసరి రమేశ్, మహిళా విభాగం అధ్యక్షురాలు స్వరూపారాణి, నాయకులు పాల్గొన్నారు.


ప్రచార రథానికి పూజలు చేస్తున్న మంత్రి అల్లోల

# ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేది కేసీఆరే..

- బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయం
- ప్రచార రథానికి పూజలు చేసిన మంత్రి అల్లోల

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 16 : పేద, మధ్య తరగతి ప్రజల ఆకాంక్షను నెరవేర్చేది సీఎం కేసీఆర్ ఒక్కరేనని అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని తన నివాసంతో నిర్మల్ నియోజకవర్గంలో ప్రచారం చేపట్టే ప్రచార వాహనానికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సబ్బండ వర్గాలకు ఉపయోగపడేలా సీఎం కేసీఆర్ మ్యానిఫెస్టోను రూపొందించారని, రాష్ట్రవ్యాప్తంగా ప్రజలందరూ హర్షిస్తున్నారన్నారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోతో ప్రతిపక్ష పార్టీలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయని అన్నారు. నిర్మల్ జిల్లాలో మూడు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ జెండా ఎగురడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి సతీమణి విజయలక్ష్మి, క్లిమామ్ వ్యవస్థాపకురాలు అల్లోల దివ్యారెడ్డి, యువ నాయకులు అల్లోల గౌతం రెడ్డి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ మ్యానిఫెస్టో చరిత్రాత్మకం

భైంసా, అక్టోబర్ 16 : తెలంగాణ రాష్ట్రంలో ఉన్న అన్ని వర్గాల సంక్షేమానికి సీఎం కేసీఆర్ ఎన్నికల మ్యానిఫెస్టోను ప్రకటించడం చరిత్రాత్మకమని ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అమలుకు సాధ్యం కాని హామీలిచ్చి ప్రజలను మోసం చేస్తున్నదన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా బడుగు, బలహీన వర్గాలకు మేలు చేకూర్చేలా బీఆర్ఎస్ మ్యానిఫెస్టో ఉండడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తొమ్మిదిన్నరేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందన్నారు. ప్రజలందరూ నిండు మనసుతో ఆశీర్వదించి మూడోసారి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకరావాలన్నారు. ఇప్పటికే రైతుబంధు కింద ఇస్తున్న పెట్టుబడి సాయం కాకుండా అధికారంలోకి రాగానే ఎకరానికి రూ. 12 వేలు క్రమంగా ఐదేండ్లు పెంచుతూ గరిష్ఠంగా ఎకరానికి రూ.16 వేలకు పెంచుతారని అన్నారు. రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం, పేదలకు ఆరోగ్య బీమా, తెల్లకార్డు కలిగిన ప్రతి ఇంటికి రైతుబీమా తరహాలో రూ.5 లక్షలు జీవిత బీమాను ప్రకటించారని అన్నారు. అంతేగాకుండా అసైన్డ్ భూములకు రైతులకు హక్కులు కల్పిస్తారని అన్నారు. మూడోసారి ముథోల్ నియోజకవర్గంలో శాసన సభ్యునిగా పోటీ చేసేందుకు బీ ఫాం తీసుకున్నానని, మరోసారి ప్రజలు భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

# పాలాభిషేకం

సోన్, అక్టోబర్ 16 : నిర్మల్ మండలంలోని వెంగ్వాపేట్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు, రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డికి బీ–ఫామ్ అందుకోవడంతో నాయకులు పాలాభిషేకం నిర్వహించారు. మూడోసారి హ్యాట్రిక్ దిశగా కష్టపడి పని చేసి మంత్రి అల్లోలను గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉన్నామని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ దుర్కి సాయన్న, కర్రొల్ల చిన్నయ్య, సాద అశోక్, ఆకుల రమేశ్, కొప్పుల నర్సయ్య, బాజ ప్రసాద్, నితిన్, కొప్పుల కృష్ణ, జనార్ధన్, అడెపు శేఖర్, అరవింద్, ముత్యం, తదితరులు పాల్గొన్నారు.


వెంగ్వాపేట్‌లో సీఎం కేసీఆర్, మంత్రి అల్లోల చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న నాయకులు

# అనిల్ ను భారీ మెజార్టీతో గెలిపించాలి..

- బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి గొడం నగేశ్
- నేరడిగొండలో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం


మాట్లాడుతున్న మాజీ ఎంపీ గొడం నగేశ్


సమావేశానికి హాజరైన కార్యకర్తలు

నేరడిగొండ, అక్టోబర్ 16 : ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాదవ్ అనిల్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని మాజీ ఎంపీ, నియోజకవర్గ ఇన్‌చార్జి గొడం నగేశ్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సోమవారం బోథ్ మండల కేంద్రంలోని సూర్యగార్డెన్‌లో బీఆర్ఎస్ మండల కన్వీనర్ అల్లూరి శివారెడ్డి అధ్యక్షతన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేసీఆర్ మ్యానిఫెస్టోను చూసి ప్రజలు హర్షిస్తున్నారని పేర్కొన్నారు. కేంద్రంలో పదేండ్లు కాంగ్రెస్, బీజేపీ పార్టీలు పాలించి దేశాన్ని అప్పుల ఊబిలోకి నెట్టాయన్నారు. లక్షల కోట్లు అప్పులు చేసి ఈ రోజు దేశానికి అప్పుల భారం పట్టి పీడిస్తోందన్నారు. మండల నాయకులు, కార్యకర్తలు యువ నాయకుడు జాదవ్ అనిల్‌ను భారీ మెజారిటీ కట్టబెట్టాలన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి జాదవ్‌అనిల్ మాట్లాడుతూ.. మీ ఇంటి బిడ్డను, మీ వాడిని.. ముఖ్యమంత్రి కేసీఆర్ మనపై పెద్ద బాధ్యత పెట్టినాడు. అందుకే మీరందరూ నన్ను గెలిపిస్తే కడుపులో పెట్టి చూసుకుంటానని అన్నారు. మీరు ఆశీర్వదిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని, ఈ అవకాశాన్ని మనందరం తప్పకుండా సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఓట్ల కోసం కాంగ్రెస్, బీజేపీ పార్టీల నాయకులు వస్తారు వారిని నమ్మవద్దని చెప్పారు. పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఎంపీపీ రాథోడ్ సజన్, నిమ్మల ప్రీతం రెడ్డి, మంజుల, జడ్పీటీసీలు రాజు, సుధాకర్, వైస్ ఎంపీపీ మహేందర్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ పెంట వెంకటరమణ, మాజీ జడ్పీటీసీ సయ్యద్ జహీర్, వీడీసీ చైర్మన్ ఏలేటి రవీందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు సాబ్లె కిశోర్‌సింగ్, మందుల రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

## అనిల్ జాదవ్‌కు మద్దతు

నేరడిగొండ, అక్టోబర్ 16 : బోథ్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాదవ్ అనిల్‌ను ఆదిలాబాద్ జిల్లా జై ఆదివాసీ యువ శక్తి సంఘం జిల్లా సభ్యులు సోమవారం నేరడిగొండలోని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా జాదవ్ అనిల్‌కు బలపరుస్తూ మద్దతుగా ఉంటామని పేర్కొన్నారు. అనంతరం శాలువా కప్పి సన్మానించారు. ఇందులో జై ఆదివాసీ యువశక్తి జిల్లా అధ్యక్షుడు జి బిపిన్‌కుమార్, ఉపాధ్యక్షుడు ప్రకాశ్ కుమార్, తొడసం శంకర్, సభ్యులు మెస్రం ప్రకాశ్, నైతం గణేశ్‌లు కలిసిన వారిలో ఉన్నారు.


జాదవ్ అనిల్‌ను సన్మానిస్తున్న 'జై ఆదివాసీ యువశక్తి' జిల్లా నాయకులు